క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు యడవిల్లి ప్రసాద్, వంశీ, ఫణిశర్మ, చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



సీతంపేటలో ర్యాలీ చేస్తున్న రిఫరల్ ఆసుపత్రి వైద్య సిబ్బంది

శంఖవరం: మండలంలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ (టీబీ) వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. జాతీయ రహదారిపై ర్యాలీ చేసి ప్రజలకు క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లెషర్‌బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే నివారించవచ్చన్నారు. క్షయ వ్యాధి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజీవ్‌కుమార్, సూపర్‌వైజర్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుడిపై కేసు కొట్టివేత

తుని: జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం పబ్లిక్ హియిరింగ్ సమయంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహారావుపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేస్తూ తుని మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేసుకు సంబంధించిన వివరాలను న్యాయవాది ఏకే మల్లేశ్వరరావు తెలిపారు. 2017లో తొండంగి మండలంలో జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి పబ్లిక్ హియిరింగ్‌కు హాజరు కావడానికి వచ్చిన రైతు సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడేళ్ల పాటు విచారణ జరిగిందని, న్యాయమూర్తి ఇరు పక్షాల వాదనలు పరిశీలించి కేసును కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారని చెప్పారు. రైతు సంఘం నాయకుడు నిర్దోషిగా బయటకు రావడంతో సీపీఎం నాయకులు శ్రీనివాస్, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

విస్తృతంగా తనిఖీలు



లోవకొత్తూరు జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్, ఎస్ఈబీ పోలీసులు

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగలు, నగదు, ఇతరేతర సామగ్రి అక్రమ తరలింపును అడ్డుకునేందుకు పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం రూరల్ ఎస్సై రమేష్‌బాబు, ఎస్ఈబీ ఎస్సై చిట్టిబాబు ఆధ్వర్యంలో పోలీసులు తాళ్లూరు, లోవకొత్తూరు జంక్షన్లలో చిన్న, పెద్ద వాహనాలను తనిఖీలు చేశారు. ఇప్పటికే జాతీయ రహదారిపై సరిహద్దు చెక్ పోస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ పక్క దారుల నుంచి అక్రమ రవాణ జరిగే అవకాశాలు ఉండడంతో హైవేను ఆనుకుని ఉన్న గ్రామీణ రహదారుల్లో తనిఖీలు చేస్తున్నట్టు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. అనుమతులు లేకుండా నగదు, నగలు తరలివచ్చవద్దని ఆయన సూచించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలులో వేంచేసిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం 'ఉత్తర'ను పురస్కరించుకుని పండితులు తెల్లవారుజామున స్వామివారికి చందనాభిషేకం, జలాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప సేవా సంఘం సభ్యులు ఓరుగంటి నానాజీ, శీరం రమణ, బందారు అప్పారావు, ఓరుగంటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలకు చెక్

- రాచపల్లిలో రూ.1.54 కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మాణం
- 14 జీఎల్ఆర్ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా
- వేసవిలో సైతం నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రాచపల్లిలో రూ.1.54 కోట్లతో చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు



జీఎల్ఆర్ వాటర్ ట్యాంకు వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు పూర్తిగా తీరాయి. గత ప్రభుత్వ హయాంలో గుక్కెడు తాగునీటి కోసం గ్రామ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల తాగునీటి అవసరార్థం రూ.11.90 లక్షలతో 14 జీఎల్ఆర్ వాటర్ ట్యాంకులు నిర్మించారు. పంచాయతీ వీధి, తదితర ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.1.54 కోట్లతో 1.60 లక్షల లీటర్ల సామర్థం కలిగిన రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మిస్తున్నారు. దీంతో పాటు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ చొరవతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గత పరిస్థితికి భిన్నంగా..

గత ప్రభుత్వంలో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎండాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితంగా గ్రామంలోని పెరికి వీధి, ఎస్సీ కాలనీ, ఎండీ పేట, నంది సెంటర్, పెరుమాళ్ల స్తంభం వీధి తదితర ప్రాంతాల్లో రూ.11.90 లక్షలతో 14 జీఎల్ఆర్ వాటర్ ట్యాంకులను నిర్మించి ప్రజలకు తాగునీటిని అందించారు. జలజీవన్ నిధులు రూ.1.54 కోట్లతో 1.60 లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

గతంలో తాగునీటికి అష్టకష్టాలు



గత ప్రభుత్వ హయాంలో రాచపల్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. గుక్కెడు నీటి కోసం అష్టకష్టాలు పడవలసి వచ్చేది. ఎండాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. గత ప్రభుత్వంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకొన్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తున్నారు.

–గొల్ల కాంతం, గ్రామస్తురాలు, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

తాగునీటి సమస్య పరిష్కారం



గతంలో తాగునీటి కోసం పడ్డ కష్టాలు వర్ణణాతీతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని ప్రతి వీధిలోనూ ఒక జీఎల్ఆర్ వాటర్ ట్యాంకుతో పాటు వీధి, వ్యక్తిగత కుళాయిలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామంలో చేపట్టిన భారీ రక్షిత మంచినీటి పథకం పనులు పూర్తయితే వ్యక్తిగత కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందుతుంది.

–కిల్లాడి అప్పలరాజు, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభం



గోకవరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు దంపతులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన రమాసత్య నారాయణస్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేన పూజ, ప్రతిష్ఠా సంకల్పం, యాగశాల ప్రవేశం, సర్వతోభద్ర మండల మండప దేవతారాధనలు, యాగశాల బలిహరణ, అగ్నిమదనం, ఆవాహిత దేవత మూలమంత్ర హోమం, చతుర్వేద స్వస్తి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు పీటలపై కూర్చొని ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రూ.35 లక్షలతో ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తోట నరసింహం సతీమణి వాణి
- పి.నాయకంపల్లిలో ఎన్నికల ప్రచారం



పి.నాయకంపల్లిలో ఎన్నిక ప్రచారం చేస్తున్న తోట వాణి, శ్రీనిధి

గండేపల్లి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని పి.నాయకంపల్లిలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ పథకాలన్నీ నిరాటంకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ గ్రామ కన్వీనర్ మలిరెడ్డి పాపారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- యర్రవరంలో ఎన్నికల ప్రచారం



యర్రవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని యర్రవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, పార్టీ నాయకులు నీరుకొండ అర్జునరావు, దాసరి రమేష్, బుద్దా గణేష్, బుద్దా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



తుని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్ మల్లిక్, చైర్‌పర్సన్ సుధారాణి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం

తుని: గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ కోరారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత స్థానిక కొత్తపేట లక్ష్మీగణపతి ఆలయంలో శంకర్ మల్లిక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వార్డులో గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లోనూ పురపాలక సంఘం ద్వారా రూ.కోట్లతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సహకారంతో ఒకొక్క వార్డులో రూ.2 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. మీకు మంచి జరిగిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- ఇ.గోకవరం, వేములపాలెం గ్రామాల్లో గడప గడపకూ...



ఇ.గోకవరంలో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని ఇ.గోకవరం, వేములపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన నవరత్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గొల్లపల్లి దొరబాబు, పార్టీ నాయకులు అన్నిక సత్తిబాబు, బొన్నోజు నాగేశ్వరరావు, తుట్టా జమ్మిందార్, దిడ్డి రాజు, చింతల రాజు, మేడిబోయిన చంద్రశేఖర్, నేదుళ్ల శ్రీను, కొమ్మన కుమార్, పిల్లా చిన్నా, జల్లిగంపక ప్రభాకరరావు, శెట్టి సత్తిబాబు, మామిడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం'



మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలోని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేత తిర్రి వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల కోసం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని కలిసికట్టుగా గెలిపించుకోవడానికి కృషి చేద్దామన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్ రాజా, కరుటూరి వీర్రాజు, ఎస్పీ గఫూర్, రామకుర్తి జగాల్, సప్పా రఘు, బోడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో అగ్ని ప్రమాదం

పశువులపాక, ట్రాక్టర్, ఎడ్లబండి దగ్ధం



దగ్ధమైన పశువులపాకను పరిశీలిస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్, తదితరులు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో రైతు మజ్జూరు కొండకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుక్కు ట్రాక్టర్, ఎడ్లబండి, పశువుల పాక, గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తుని అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, నాయకుడు రాయి దాసు, పాపారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతును పరామర్శించి, ఓదార్చారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితులను ఆదుకుంటామని సర్పంచ్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

సైకిల్ యాత్ర చేసిన యువకులకు సత్కారం



అయోధ్యకు సైకిల్‌యాత్ర చేసిన యువకులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కోటనందూరు: మండలం నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర చేసిన యువకులను ఘనంగా సత్కరించారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని బొద్దవరానికి చెందిన బుద్దా రాజు, భీమవరపుకోటకు చెందిన నిట్టల శ్రవణ్‌కుమార్, దొడ్డి ప్రసన్నకుమార్ ఇటీవల 27 రోజుల పాటు 1800 కిలోమీటర్లు సైకిళ్లపై ప్రయాణం చేసి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామాలయాన్ని దర్శించారు. ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న ఈ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి తిరిగి ఇంటికొచ్చిన యువకులను స్థానిక శివాలయంలో అల్లూరి సీతారామరాజు సేవాకమిటీ, శివాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. యువత తప్పుడు మార్గంలో నడుస్తున్న నేటి రోజుల్లో ఈ యువకులు ఎంతో గొప్పదైన అయోధ్య యాత్రచేయడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి ఆలయకమిటీచైర్మన్ వత్సవాయి నారాయణమూర్తిరాజు, సినీ నటుడు మహర్షి రమణ, ఎస్సై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక లలితాదేవి ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు.

వలంటీర్ల సేవలు అమోఘం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

గండేపల్లి: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు చేసిన సేవలు అమోఘమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పేర్కొన్నారు. మండలంలోని పి.నాయకంపల్లిలో గ్రామ సర్పంచ్ మలిరెడ్డి అన్నపూర్ణ నివాసంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రపంచ శాంతిదూత మదర్‌థెరిసా మాదిరిగా కరోనా సమయంలో వలంటీర్లు బాధితులకు విశేష సేవలు అందించారన్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని లబ్ధిదారుల ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లదే అన్నారు. శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. సుధీర్‌రెడ్డి వలంటీర్లను ఉగ్రవాదులుగా పోల్చడం తగదన్నారు. ఇటువంటి ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ జేసీఎస్ మండల కన్వీనర్, పార్టీ నాయకుడు మలిరెడ్డి పాపారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, పార్టీ నేతలు కరుటూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రంగుల హోలీ.. ఆనందాల కేళి



ఏలేశ్వరంలో చిన్నారుల హోలీ సందడి

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో యువత ఉత్సాహంగా హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో పాటు యువతీయువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. స్థానిక పెద్దవీధి, తోటవీధి, మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడంతో యువతీయువకులు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

బూటకపు చేరికలతో టీడీపీకి వాపు



గుల్లా ఏడుకొండలు (ఫైల్)

గోకవరం: నియోజకవర్గంలో బూటకపు చేరికలతో టీడీపీ వాపు చూపిస్తోందని వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గోకవరం మండలం ఇటికాయలపల్లిలో 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరాయన్నది అవాస్తవమన్నారు. టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఇటికాయలపల్లి వచ్చి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొంత మంది వ్యక్తులను కలిసి పలువురికి కండువాలు వేసి వెళ్లారన్నారు. గతంలో టీడీపీ నుంచి జనసేనలోకి వెళ్లిన కొంత మందికి టీడీపీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీ నుంచి చేరికలు అని డప్పు కొట్టుకుంటున్నారని విమర్శించారు. ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తకు కూడా టీడీపీ కండువా వేయలేకపోయారన్నారు. ఈ విధంగా అసత్య ప్రచారం, గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ నాయకులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.